క్లుప్తంగా

చిన్నమ్మతల్లి పండగ సందడి



చిన్నమ్మతల్లిని గ్రామంలోకి తీసుకువస్తున్న భక్తులు

రామభద్రపురం: మండల కేంద్రంలో చిన్నమ్మతల్లి పండగ సందడి నెలకొంది. ఈ నెల 27, 28, మార్చి 1 తేదీల్లో అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా సోమవారం రాత్రి చిన్నమ్మతల్లిని మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ గ్రామంలోకి తీసుకువచ్చారు. అమ్మవారు ఊరిలోకి రావడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. అమ్మవారిని ఆహ్వానించేందుకు అన్ని వీధుల్లోని వారు దీపాలు వెలిగించి, పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నుంచి చిన్నమ్మతల్లి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం కాగా బుధవారం రాత్రి నుంచి 27వ తేదీ వరకు ప్రతిరోజూ అమ్మవారి ఘటాలు వీధుల్లో ఊరేగిస్తారు. 27 తేదీన తొలేళ్ల ఉత్సవం, 28వ తేదీన పెద్దపండగ, మార్చి 1వ తేదీన అనుపోత్సవం నిర్వహిస్తారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రేగిడి విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రేగిడి: రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ చాంపియన్ పోటీల్లో మండలంలోని రేగిడి ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు కృష్ణా జిల్లాలోని హనుమాన్ జంక్షన్ బవలపాడులో ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుందని ఈ జట్టులో విద్యార్థులు ఎ.సుమలత, ఎస్.చాందిని, పి.కావ్య, జి.పావని పాల్గొని, విశేష ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మరడాన రామినాయుడు మంగళవారం విలేకరులకు తెలిపారు. సదరు విద్యార్థులను హెచ్ఎంతో పాటు ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు, సర్పంచ్ కిమిడి రవిశంకర్, విద్యా కమిటీ చైర్మన్ ఎం.రామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎ.చిన్నమ్మడు, ఉపాధ్యాయులు అభినందించారు.

బాలికల ఆరోగ్యంపై దృష్టిసారించాలి

రాజాం సిటీ: బాలికల ఆరోగ్యంపై దృష్టిసారించాలని బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారి బి.నరేంద్ర సూచించారు. మండల పరిధిలోని బొద్దాం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఆయుష్మాన్ భారత్ హెల్త్ మేళాలో భాగంగా సైక్లింగ్‌పై మంగళవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ సైక్లింగ్ చేయడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చని తెలిపారు. సైకిల్ తొక్కడం ద్వారా శరీరంలోని అవయవాల కదలిక సక్రమంగా ఉంటుందని తద్వారా గుండె, శ్వాసకోశ వ్యాధులు రావన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం గీతారాణి తదితరులు పాల్గొన్నారు.


విద్యాసామగ్రి వితరణ

రామభద్రపురం: స్థానిక భవిత కేంద్రంలోని ప్రత్యేకావసరాలు గల పిల్లలకు బూసాయవలసకు చెందిన వెంకటేశ్వర బోర్‌వెల్స్ యజమాని ఎం.శ్రీనివాసరావు దంపతులు విద్యాసామగ్రి, టిఫెన్‌బాక్సులు వితరణ చేశారు. వీటిని ఎంఈఓ తిరుమలప్రసాద్ చేతుల మీదుగా మంగళవారం చిన్నారులకు అందజేశారు. మరికొంతమంది దాతలు ముందుకు వచ్చి, దివ్యాంగ విద్యార్థులను ఆదుకోవాలని ఎంఈఓ కోరారు. అనంతరం దాతలను అభినందించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు సీహెచ్ రాజేశ్వరి, బి.అచ్యుతరావు పాల్గొన్నారు.

అమరజవానులకు నివాళి

బొబ్బిలి: స్థానిక ఎస్‌ఈబీ కార్యాలయంలో పుల్వామా దాడిలో అమరులైన జవానులకు మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రెడ్డి దామోదరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఘన నివాళులర్పించారు. అనంతరం వారి సేవలను ఎస్‌ఈబీ సీఐ ఆర్.జైభీమ్ కొనియాడారు. కార్యక్రమంలో న్యాయవాదులు బీఎస్ఆర్ మూర్తి, టి.గంగాధర్, మాస్‌బాలు యాదవ్ పాల్గొన్నారు.

పక్కాగా స్వయంశక్తి సంఘాల ఆడిట్



ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

రాజాం సిటీ: స్థానిక మార్కెట్‌యార్డులో రాజాం క్లస్టర్ పరిధిలోని రాజాం, సంతకవిటి, తెర్లాం మండలాలకు చెందిన మహిళా స్వయంశక్తి సంఘాలు, మండల మహిళా సమాఖ్యల ఆర్థిక లావాదేవీలపై మంగళవారం ఆడిట్ నిర్వహించారు. ఫైనాన్స్ విభాగం డీపీఎం ఎన్.ఆదిత్య ఆధ్వర్యంలో జిల్లా ఎల్‌సీ బృందం సంఘాల ఆర్థిక లావాదేవీలపై వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం వెలుగు శాఖ రాజాం ఏరియా కో–ఆర్డినేటర్ అలుగోలు చిరంజీవి మాట్లాడుతూ వీఓఏలంతా స్వయంశక్తి సంఘాల పుస్తకాలు సక్రమంగా ఉంచాలని, తప్పుడు లెక్కలు చూపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ నివేదిక వెల్లడిస్తుండగా, సూచనలిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం:

రానున్న వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో తొలుత నాడు–నేడు డీఈఈ జగ్గారావు తన నివేదికలు చదువుతూ నాడు–నేడు పథకం ద్వారా ఫేజ్–2 కింద మండలంలోని 21 పాఠశాలల్లో రూ.7.44 కోట్ల వ్యయంతో మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి దిలీప్‌కుమార్ నివేదికలు వెల్లడిస్తూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా దాదాపు 16 వేల మందికి వైద్యసేవలందించామని పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ డి.చిన్నయ్య తన నివేదికలో పేర్కొన్న మండంలోని జలజీవన్ మిషన్ కింద 45 పనుల పూర్తిని వివరించారు. అలాగే మూడు గ్రామాల్లో నిర్మాణ దశలోని 3 రక్షిత మంచినీటి పథకాలు దాదాపు పూర్తికావచ్చాయని వెల్లడించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ తన నివేదికలు వెల్లడిస్తుండగా బూసాయవలస పాఠశాలకు సరఫరా చేసే బియ్యానికి ముందుగానే బయోమెట్రిక్ వేసి, 10 రోజుల వరకు బియ్యం ఇవ్వడం లేదని ఎంపీటీసీ సభ్యులు మడక తిరుపతినాయుడు సభ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే గ్రామంలో కూడా బియ్యం సక్రమంగా సరఫరా చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మిర్తివలస గ్రామంలో సైతం సక్రమంగా లబ్ధిదారులకు రేషన్ పంపిణీ కావడం లేదని, లబ్ధిదారులతో ముందుగానే బయోమెట్రిక్ వేయించి కొన్నిరోజుల తర్వాత బియ్యం ఇస్తున్నారని సర్పంచ్ మజ్జి రాంబాబు తెలిపారు. పలు శాఖల అధికారులు ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు నివేదికలు చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలంతా సుభిక్షంగా ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని ప్రజాప్రతినిధులు, అధికారులంతా ఆయన లక్ష్య సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, ఎంపీడీఓ రమామణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ సంబరాలు



నాగదేవత పుట్ట వద్ద మహిళల పూజలు

బాడంగి: మండలంలోని డొంకినవలస గ్రామంలో ఎల్లమ్మతల్లి సంబరాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం మహిళలంతా పవిత్ర నదీజలాలు కలిగిన కలశాలలతో గండివాని చెరువు వద్ద ఉన్న అమ్మవారి ఆలయానికి వెళ్లి, ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు నాగదేవత పుట్టలో పాలుపోసి, పక్కనే దీపం వెలిగించి, ఆరాధించారు. బుధవారం ఉదయం మళ్లీ గండి కుటుంబీకులు అమ్మవారికి ఆలయానికి వెళ్లి, పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి, మొక్కులు చెల్లిస్తారు. అదేరోజు తమ బంధువులు, అమ్మవారికి భక్తులకు అన్నదానం చేస్తారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని, ఉత్సవ కమిటీ సభ్యులు గండి శంకరరావు, గండి వెంకటరావు, బంకురుసత్యం తెలిపారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలి



బొబ్బిలి రూరల్: మాట్లాడుతున్న ఎంపీడీఓ భాస్కరరావు

బొబ్బిలి రూరల్: బాల్యవివాహాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలని ఎంపీడీఓ అల్లు భాస్కరరావు సూచించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో 'సఖి' సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆడపిల్లల భద్రత విషయంలో అందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని, వారికి రక్షణ కల్పించేందుకు టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: సఖి కార్యక్రమ లక్ష్య సాధనకు కృషి చేయాలని సీహెచ్‌సీ వైద్యాధికారి జి.సంతోషి కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు, వీకర్ సెక్షన్ ప్రొటెక్షన్ సెక్రటరీలతో నిర్వహించిన 'సఖి' సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల సమస్యలు ఎప్పటికప్పుడు గుర్తించి, వాటిని పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఐసీడీఎస్ పీఓ విజయకుమారి, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా 'ఉపాధి' పనులు



రాజాం సిటీ: వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం సిటీ: మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పనులు చాలా ముమ్మరంగా జరుగుతున్నాయి. మండలంలోని మారెడుబాక గ్రామ పెంటవాని కోనేరులో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ బాసూరి శంకరరావు మంగళవారం పరిశీలించారు. అనంతరం వేతనదారులకు పలు సూచనలు చేశారు. రెండు పూటలా పనులు చేయాలని, నిర్దేశించిన కొలతల ప్రకారం నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపడితే రోజుకు రూ.257 వేతనం వస్తుందని తెలిపారు. జాబ్‌కార్డు ఉన్నవారిని మాత్రమే పనులకు అనుమతించాలని, పనుల్లో లేని వారికి మస్తరు వేయకూడదన్నారు. ఆయన వెంట ఏపీఓ కె.సాయిరాం ఉన్నారు.

సంతకవిటి: మండలంలోని పోతురాజుపేట నక్కవాని చెరువులో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి మంగళవారం పరిశీలించారు. వేతనదారుల మస్తర్లు పరిశీలించిన ఆయన గిట్టుబాటు అయ్యేలా కూలీ వచ్చేలా పనుల నిర్వహణపై పలు సూచనలు చేశారు.

బాడంగి: మండలంలోని ముగడ గ్రామంలో ఉన్న మత్సవాని చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ కె.అక్కారావు మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో పని ప్రదేశంలో తప్పనిసరిగా టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్సా కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తెలిపారు.

కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు చేస్తాం

- డీఐజీ హరికృష్ణ



బొబ్బిలి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు చేస్తామని డీఐజీ ఎస్.హరికృష్ణ తెలిపారు. బొబ్బిలి డీఎస్పీ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నేరాల శాతం తగ్గిందని, శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని తెలిపారు. అల్లూరిసీతారామరాజు జిల్లాలో, ఒడిశా బోర్డర్‌లో నక్సల్స్ కార్యకలాపాలు కొద్దిగా ఉన్నాయన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆయన వెంట డీఎస్పీ మోహనరావు, పట్టణ, రూరల్ సీఐలు నాగేశ్వరరావు, తిరుమలరావు ఉన్నారు. పోలీస్‌గెస్ట్ హౌస్‌ను డీఐజీ పరిశీలించారు.

యూటీఎఫ్ ఫౌండేషన్ బ్రాంచిల ఏర్పాటు

రాజాం: స్థానిక విద్యానికేతన్ స్కూల్ ఆవరణలో యూటీఎఫ్ 17వ మహాసభలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖ మండల అధ్యక్షుడు మూడడ్ల శ్రీనివాసరావు, మండల శాఖ ప్రధాన కార్యదర్శి టి.అరుణ్ కుమార్ మాట్లాడుతూ రాజాం క్లస్టర్ పరిధిలో తమ సంఘం 9 ఫౌండేషన్ శాఖలను ఏర్పాటు చేయడంతో పాటు వాటికి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను నియమించడం జరిగిందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం దిశగా యూటీఎఫ్ కృషి చేస్తోందని ఆ శాఖ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు రెడ్డి మోహనరావు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు కె.బాలమురళీకృష్ణ, పి.వాసు పాల్గొన్నారు.

యూటీఎఫ్ రాజాం నూతన కార్యవర్గం..

యూటీఎఫ్ రాజాం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ గౌరవాధ్యక్షుడిగా వి.శివరాంనాయుడు, అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా టి.అరుణ్‌కుమార్, కోశాధికారిగా బి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా బి.సింహాచలం, ఎస్.భ్రమరాంభ, కౌన్సిల్ సభ్యులుగా బి.రామినాయుడు, కె.శ్రీనివాసరావు, బి.రామకృష్ణ, వి.ఉషారాణి, జి.రమేష్, డి.వెంకటరావు, వి.చంద్రశేఖర్ ఎన్నికై నట్లు ఎన్నికల అధికారులు పి.వాసు, ఎం.కృష్ణమూర్తి తెలిపారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి

తెర్లాం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి సూచించారు. మండలంలోని వి.చిన్నయ్యపేట గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీఓ శంబంగి రామకృష్ణతో కలిసి సందర్శించిన ఆమె సచివాలయ ఉద్యోగులను ఉద్దేశించి కాసేపు మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులంతా గ్రామాల్లోని అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సచివాలయానికి సంబంధించిన రికార్డులు, ఉద్యోగుల హాజరును తనిఖీ చేసి, ఉద్యోగులంతా సమయానికి హాజరు వేయాలని, యూనిఫాం తప్పనిసరిగా ధరించాలన్నారు.

అన్నదానం

రాజాం: గాయత్రీదేవి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా పట్టణంలోని చీపురుపల్లి రోడ్డులో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అటువైపుగా వెళ్లే పాదచారులు, వాహనదారులంతా అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్తలు కొండవేటి తేజోమూర్తి, కొండవేటి వివేకానందరావు పాల్గొన్నారు.

ప్రజాప్రయోజనాలే సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

రామభద్రపురం: ప్రజాప్రయోజనాలే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, ఆ దిశగా ఆయన పాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుతో కలిసి మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రయోజనాలను కాలరాయడాన్ని టీడీపీ నాయకులు ధ్యేయంగా పెట్టుకున్నారని ఆరోపించారు. ఇక్కడి ప్రజల ఓట్లతో అధికార పదవులు అనుభవించిన టీడీపీ నాయకులు చంద్రబాబు వంటి పెత్తందారులకు వత్తాసు పలకడం సిగ్గుచేటన్నారు. తమ ప్రయోజనాలు తప్ప ఉత్తరాంధ్ర అభివృద్ధి గురించి ఆలోచించడం లేదని విమర్శించారు. ఉత్తరాంధ్ర ఎలా నష్టపోయినా వారికి ఫర్వాలేదని, కేవలం రాజకీయాలే వారికి కావాలని దుయ్యబట్టారు. ఉత్తరాంధ్ర ప్రగతిని కోరుకోకపోతే రానున్న రోజుల్లో ప్రజల నుంచి తిరుగుబాటును చూస్తారన్నారు. వెనకబడిన ఉత్తరాంధ్ర ప్రగతి పథంలో పయనించడానికి విశాఖపట్నం పరిపాలనా రాజధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా రాజకీయాలు పక్కనబెట్టి ఈ ప్రాంత అవసరాలు, బంగారు భవిష్యత్ కోసం ఆలోచన చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



దుప్పట్లు పంపిణీ చేస్తున్న పాలసొసైటీ అధ్యక్షుడు రామకృష్ణ, తదితరులు

- రామభద్రపురం పాలసొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ

రామభద్రపురం: పాడిరైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్థానిక పాలసొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక పాలసొసైటీ కేంద్రంలో సూపర్‌వైజర్ కె.వి.రమణతో కలిసి ఆయన మంగళవారం పాలు సరఫరా చేస్తున్నా 150 మంది పాడిరైతులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువులకు మిశ్రమ దాణా, గడ్డి విత్తనాలు వంటి వాటిని రాయితీపై అందించి, పాడి రైతుకు ప్రభుత్వం బాసటగా నిలుస్తోందన్నారు. సంచార పశువైద్య వాహనాలు ఏర్పాటు చేసి, పాడిపశువుల ఆరోగ్యానికి తగిన ప్రాధాన్యం ఇస్తోందన్నారు. యదకు వచ్చిన పాడిఆవులను యద ఇంజెక్షన్ల కోసం మండల కేంద్రానికి పంపించి, వాటిని ఎక్కువగా శ్రమపెట్టకుండా ఆర్‌బీకేల్లోనే కృత్రిమ గర్భోత్పత్తి ఇంజెక్షన్లు ఏర్పాటు చేసిందన్నారు. పాడి రైతులు సంచార పశువైద్య వాహనాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి చొక్కాపు లక్ష్మణ, సిబ్బంది ఎం.యర్రన్న, చింతల జనార్థనరావు, చొక్కాపు పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో వ్యవసాయ సిబ్బంది

బాడంగి: మండల కేంద్రంలో నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కె.శిరీష ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారంతా నవధాన్యాలు సాగు–నేలతల్లి బాగు, రాగులు స్వీకరించు–రోగాలు నివారించు అని నినాదాలు చేశారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ శ్రీనివాసరావు నవధాన్యాలు సాగు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. రసాయన, పురుగుమందులకు స్వస్తి పలికి, సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేయాలని దీని ద్వారా ఆరోగ్యవంతమైన పంట చేతికి రావడమే కాకుండా అధిక దిగుబడులు వస్తాయన్నారు. బాడంగిని కూడా బయోవిలేజ్‌గా మార్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జయలక్ష్మి, ఈశ్వరరావు, రమణ, సన్యాసినాయుడు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని పొగిరి, బొద్దాం, పెనుబాక, మారేడుబాక గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీలో పాల్గొని, ప్రకృతి వ్యవసాయం అటు పుడమితల్లికి, ఇటు మానవజాతికి ఎంతో ఆరోగ్యకరమని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ డి.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి సేవలు విస్తృతం చేయాలి

- డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.గౌరీశంకరరావు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడితో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ గౌరీశంకరరావు

రాజాం సిటీ:

ప్రాంతీయ ఆస్పత్రిలో సేవలు విస్తృతం చేయాలని విజయనగరం డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.గౌరీశంకరరావు సూచించారు. మంగళవారం స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఆయన ఆస్పత్రిలోని అన్ని వార్డులతో పాటు వాష్‌రూమ్‌లు పరిశీలించారు. అనంతరం వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి, సేవలపై ఆరా తీశారు. మెనూ అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత సిబ్బందితో సమావేశమై ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది సంఖ్య బాగా పెరిగిన నేపథ్యంలో సేవలు కూడా పెంచాలని తెలిపారు. సిబ్బంది సమయపాలన పాటించకపోతే లీవ్‌లు నమోదు చేయాలని సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మికి సూచించారు. ఎవరైనా ఉదయం 11 గంటల తర్వాత వస్తే వారికి సగం లీవ్‌గాను, 2 తరువాత వెళ్లిపోయిన వారికి కూడా సగం లీవ్‌గానే పరిగణించాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రోగులకు అందించే భోజనానికి సంబంధించి మెనూ చార్జీలు కూడా పెంచారని, దానికి తగ్గట్లు పౌష్టికాహారం అందించాలని తెలిపారు. ఆయన వెంట సూపరింటెండెంట్ జీవీ రాజ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా....

కోడిశ ఉన్నత పాఠశాలకు రూ.1.33 కోట్ల నిధులు

రేగిడి: మండలంలోని కోడిశ గ్రామంలో ఉన్నత పాఠశాల నిర్మాణానికి రూ.1.33 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని ఎంఈఓ ఎం.వి.ప్రసాదరావు, సమగ్రశిక్ష జేఈ యజ్జల దాలయ్య తెలిపారు. కోడిశలో జరుగుతున్న పాఠశాల భవన నిర్మాణ పనులను వారు మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి నాడు–నేడు పనులు పూర్తిచేయాలని హెచ్ఎం రవిరాజుకు సూచించారు. వారివెంట మాజీ సర్పంచ్, రేగిడి పీఏసీఎస్ అధ్యక్షుడు నెల్లి పెంటన్నాయుడు ఉన్నారు.

బంగారువలసలో అగ్నిప్రమాదం

వంగర: మండల పరిధి బంగారువలస గ్రామ సమీపంలో మంగళవారం అకస్మాత్తుగా మంటలు చెలరేగి అగ్నిప్రమాదం జరగడంతో గ్రామానికి చెందిన బౌరోతు గంగరాజు నూర్పిడి యంత్రం పాక్షికంగా కాలిపోయింది. అలాగే బౌరోతు గంగరాజు, తూముల అప్పలనాయుడు,కరణం పకీరునాయుడులకు చెందిన గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామ స్తుల సమాచారం మేరకు రాజాం అగ్నిమాప కశకటం హుటాహుటిన గ్రామానికి చేరుకుని మంటలు అదుపుచేసింది. వీఆర్‌వో అలజంగి ఈశ్వరరావు నష్టం వివరాలను సేకరించి తహసీల్దార్‌కు నివేదిక అందజేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

మెంటాడ: ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం అర్ధరాత్రి మండల కేంద్రంలో పట్టుకున్నట్లు ఆంధ్ర ఎస్సై సిద్ధార్థ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుర్ల గ్రామానికి చెందిన సిడగం బుచ్చిరాజు, గుమడాపు పోలిరాజు ట్రాక్టర్లతో ఇసుకను కొత్తవలస తరలిస్తుండగా మెంటాడ గ్రామంలో పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్లు సీజ్‌చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

12 మందిపై కొట్లాట కేసు

సంతకవిటి: మండలంలోని తాలాడ గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన కొట్లాటకు సంబంధించి రెండు వర్గాలకు చెందిన 12 మందిపై కేసు నమోదుచేశామని ఎస్సై ఆర్.జనార్ధనరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమపై దాడి చేశారని కుప్పిలి మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుప్పిలి అశోక్‌తో పాటు మరో నలుగురిపై, అలాగే మరో వర్గానికి చెందిన కుప్పిలి అశోక్ ఫిర్యాదు మేరకు కుప్పిలి మురళితో పాటు మరో ఆరుగురిపై కేసునమోదుచేశామని చెప్పారు. చిన్నారుల ఆటలో జరిగిన చిన్నపాటి వివాదం ఈ రెండు కుటుంబాల మధ్య కొట్లాటకు దారితీసిందని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, చిన్నచిన్న గాయాలపాలైన బాధితులు రాజాం, శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రులలో చికిత్స పొందినట్లు వెల్లడించారు.

ఆర్పీల్లో గుబులు!

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధిలోని ఆర్పీల్లో గుబులు మొదలైంది. పొనుగుటివలస గ్రామానికి చెందిన ఆర్పీ అవకతవకలకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆర్పీ పరిధిలోని సంఘాల లావాదేవీలపై బ్యాంకు అధికారులను కలిసి మెప్మా అధికారులు ఆరా తీశారు. రూ.6.48 లక్షలు ఇంతర అకౌంట్లకు జమచేసినట్లు గుర్తించామని టీఎంసీ ఎస్‌వీ రత్నం మంగళవారం తెలిపారు. పూర్తిస్థాయిలో వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ఈ నెల 16న మున్సిపాల్టీలోని అందరు ఆర్పీలతోపాటు సంఘాల అధ్యక్షుల గ్రూపుల ఆడిట్ చేస్తామని చెప్పారు. దీంతో ఆయా సంఘాల సభ్యులతో ఆర్పీలు రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారు. అధికారులు పూర్తిస్థాయిలో ఆడిట్ నిర్వహిస్తే మిగిలిన సంఘ సభ్యులు ఎంత మొత్తంలో నష్టపోయారో తెలుస్తుందని పాదుపు సంఘాల సభ్యులు చెబుతున్నారు.

ఉగాదిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

తెర్లాం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను ఉగాది పండగలోగా పూర్తి చేయండి అని మండల హౌసింగ్ ఏఈ ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. మండల కేంద్రంలోఇ జగనన్న ఇళ్ల లేవుట్‌లో ఇళ్ల నిర్మాణ స్థితిగతులను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉగాది రోజున సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80లక్షలు విడతల వారీగా అందిస్తోందని, సకాలంలో నిర్మాణ సామగ్రి, బిల్లులు కూడా చెల్లిస్తోందని తెలిపారు.

ఆస్తిపన్ను వసూలు వేగవంతం

రాజాం సిటీ: ఆస్తిపన్ను వసూలును వేగవంతం చేయాలని మున్సిపల్ మేనేజర్ ఎంవీ నాగరాజు సూచించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో పన్నుల వసూళ్లను ముమ్మరంగా చేపడుతున్నామని, కొంతమందికి డిమాండ్ నోటీసులు కూడా అందజేస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార సదస్సు

రాజాం సిటీ: స్థానిక మాధవబజార్‌లోని విద్యుత్ శాఖ కార్యాలయంలో బుధవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సదస్సు నిర్వహించనున్నామని విద్యుత్ శాఖ ఏడీ ఫణీంద్రకుమార్ మంగళవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఈ సదస్సు ఉంటుందని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, బిల్లుల సమస్యలు, పవర్ సప్లయిలో హెచ్చు,తగ్గులు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, బిల్లులో పేరు మార్పు, సరఫరా పునరుద్ధరణలో ఇబ్బందులు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి వంటి సమస్యలను పరిష్కరించనున్నామన్నారు. ఈ సదస్సును విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.